

ఎన్నిక ఏదైనా..

రాష్ట్రంలో ఏఎన్నిక వచ్చినా గెలుపు బీఆర్‌ఎస్‌దే ఉండాలని మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి పిలుపునిచ్చారు. 8లో▸



పనులు అప్పగించొద్దు

ఉపాధ్యాయులను బోధనేతర పనులకు విని యోగించడం తగ్గించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పవీణ్‌కుమార్ అన్నారు. 8లో▸



నోటీసులిచ్చారు..

ప్రభుత్వ భూమి నుంచి మట్టి తరలించిన వారిపై చర్యలు తీసుకోవాలని సోలిపేట్ రైతులు కోరారు. 8లో▸

లెక్క తేలింది!



జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలు ఖరారు

- జిల్లాలో 21 జెడ్పీటీసీ, 230 ఎంపీటీసీలు
- కొత్త మున్సిపాలిటీల ఏర్పాటుతో తగ్గిన 32 సర్పంచ్, 27 ఎంపీటీసీ స్థానాలు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఎట్టకేలకు ప్రభుత్వం జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలు ఖరారు చేసింది. ఈ మేరకు బుధవారం ఆయా స్థానాల జాబితాను విడుదల చేసింది. జిల్లాలో 27 మండలాలు ఉండగా, వీటి పరిధిలో 21 జెడ్పీటీసీ స్థానాలు సహా మరో 230 ఎంపీటీసీ స్థానాలను ఖరారు చేసింది. కొత్తగా మెయినాబాద్, చేవెళ్ల మున్సిపాలిటీలను ఏర్పాటు చేయడంతో పాటు పలు గ్రామాలను సమీప మున్సిపాలిటీల్లో విలీనం చేయడంతో ఎంపీటీసీ స్థానాలతో పాటు గ్రామ పంచాయతీల సంఖ్య కూడా తగ్గింది. 2019లో జిల్లాలో 257 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, ప్రస్తుతం వీటి సంఖ్య 230కి చేరింది. 27 ఎంపీటీసీ స్థానాలను కోల్పోవాల్సి వచ్చింది. గతంలో 558 గ్రామ పంచాయతీలుండగా, ప్రస్తుతం వీటి సంఖ్య 526కు చేరింది. వీటి పరిధిలో మొత్తం 7,94,653 మంది ఓటర్లు ఉండగా, వీరిలో 3,99,404 మంది పురుషులు, 3,95,216 మంది మహిళలు, 33 మంది ఇతర ఓటర్లు ఉన్నారు. బీసీ రిజర్వేషన్ల ఆర్డినెన్స్, ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన వెంటనే స్థానిక సంస్థల్లో ఎన్నికల హడావుడి మొదలు కానుంది.

నోటిఫికేషన్ రావడమే ఆలస్యం

2024 జనవరి 30తో స్థానిక సంస్థల పాలకవర్గాల గడువు ముగిసింది. నాటి నుంచి ఇప్పటి వరకు ఆయా గ్రామ పంచాయతీలు ప్రత్యేక అధికారుల పాలనలోనే కొనసాగుతున్నాయి. స్థానిక సంస్థలకు పాలకమండళ్లు లేక 15వ ఆర్థిక సంఘం నుంచి రావాల్సిన నిధులు నిలిచిపోయాయి. దీంతో తాగు నీటి బోర్లకు రిపేర్లు, వీధిలైట్లు, ట్రాక్టర్లకు డీజిల్ ఖర్చులకు ఇబ్బంది పడాల్సి వచ్చింది. కొన్ని పంచాయతీల్లో అధికారులు అప్పులు చేయాల్సి వచ్చింది. స్థానిక సంస్థల్లో బీసీ కోటాను అమలు చేయాలని కోరుతూ కొంత మంది కోర్టును ఆశ్రయించడం, ఇదే అంశంపై హైకోర్టు ఇటీవల స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడం, మూడు మాసాల్లోగా ఈ ప్రక్రియను పూర్తి చేయనున్నట్లు ప్రభుత్వం కోర్టుకు హామీ ఇవ్వడం తెలిసిందే. తాజాగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలను ఖరారు చేసింది. నోటిఫికేషన్ జారీ చేయడమే ఆలస్యం ఆయా స్థానాలకు ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. ఇదే సమయంలో జిల్లా యంత్రాంగం జిల్లా ప్రాదేశికాలు, మండల ప్రాదేశికాల వారీగా రిజర్వేషన్లు ఖరారు చేసే పనిలో నిమగ్నమైంది. ఇప్పటికే ఈ పని దాదాపు పూర్తి చేసినట్లు తెలిసింది. పోలింగ్‌బూత్‌ల వారీగా బీఎల్‌ఓలను నియమించి, వారికి శిక్షణ సైతం పూర్తి చేసింది.

మున్సిపాలిటీల్లో విలీనం

- చేవెళ్ల మండల పరిధిలో 37 గ్రామ పంచాయతీలుండగా, వీటిలో 12 గ్రామాలు కొత్తగా ఏర్పాటు చేసినా మున్సిపాలిటీలో విలీనమయ్యాయి. ఇక్కడ 17 ఎంపీటీసీ స్థానాలకు.. ప్రస్తుతం ఏడు స్థానాలను కోల్పోవాల్సి వచ్చింది.
- మెయినాబాద్ మండల పరిధిలో గతంలో 28 గ్రామ పంచాయతీలుండగా, వీటిలో తొమ్మిది గ్రామ పంచాయతీలతో మున్సిపాలిటీని ఏర్పాటు చేశారు. దీంతో తొమ్మిది సర్పంచ్ స్థానాలను కోల్పోవాల్సి వచ్చింది. ఇక్కడ 17 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, ప్రస్తుతం ఎనిమిదింటిని కోల్పోవాల్సి వచ్చింది.
- శంకర్‌పల్లి మండల పరిధిలోని జన్వాడ, మీర్జాగూడలను ఇటీవల నార్సింగి మున్సిపాలిటీలో విలీనం చేయగా, అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని తారామతిపేట్, కుత్బుల్లాపూర్, గౌరెల్లి, బాచారం గ్రామాలను పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీలో విలీనం చేశారు. దీంతో ఆ మండలంలో నాలుగు సర్పంచ్, మూడు ఎంపీటీసీ స్థానాలను కోల్పోవాల్సి వచ్చింది.
- కొత్తూరు మండలంలో పది ఎంపీటీసీ స్థానాలు ఉండగా, మున్సిపాలిటీ ఏర్పాటుతో కొత్తగా నాలుగు స్థానాలను కోల్పోవాల్సి వచ్చింది. చిన్నగోల్కొండ, పెద్ద గోల్కొండ, శంకరాపురం, రషీద్‌గూడ, హమీదుల్లానగర్, బహదూర్‌గూడ పంచాయతీలను ఇటీవల శంషాబాద్ మున్సిపాలిటీలో విలీనం చేశారు. దీంతో ఈ మండలంలో మూడు ఎంపీటీసీ స్థానాలు సహా ఆరు సర్పంచ్ స్థానాలను కోల్పోవాల్సి వచ్చింది.



యాచారం తహసీల్దార్ అయ్యప్పతో మాట్లాడుతున్న ముదిరెడ్డి కోదండరెడ్డి

పనితీరు మార్చుకోవాలి

- సర్కార్‌కు చెడ్డపేరు తెస్తే ఊరుకోం
- రైతులు కార్యాలయాల చుట్టూ ఎన్నాళ్లు తిరగాలి ?
- రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ముదిరెడ్డి కోదండరెడ్డి

యాచారం: అధికారులు తమ పనితీరు మార్చుకోవాలి.. ఇంకా పాత పద్ధతినే కొనసాగిస్తామంటే కుదరదని, రైతులు ఎన్నాళ్లు తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరగాలని రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ముదిరెడ్డి కోదండరెడ్డి మండిపడ్డారు. బుధవారం ఆయన యాచారం తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. భూ సమస్యల పరిష్కారం కోసం రైతులు పెద్ద సంఖ్యలో తహసీల్దార్ కార్యాలయం వద్ద వేచి ఉన్నారు. పలువురు రైతులు తమ భూ సమస్యలపై కోదండరెడ్డికి ఫిర్యాదు చేశారు. ఏళ్ల నుంచి వేలాది రూపాయల ఫీజులు చెల్లించి, మీసేవల్లో దరఖాస్తులు చేసుకున్నా, రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తు చేసుకున్నా, కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఫలితం ఉండడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు స్పందించిన చైర్మన్ తహసీల్దార్ అయ్యప్పను వీరి సమస్యలు ఎందుకు పరిష్కరించలేదని ప్రశ్నించారు. ఇందుకు తహసీల్దార్ అయ్యప్ప, డిప్యూటీ తహసీల్దార్ కీర్తి సాగర్ నిబంధనలు, సాకులు చెబుతుండగా చైర్మన్ కలుగచేసుకుని మూస పద్ధతి మానండి, క్షేత్రస్థాయిలో సర్వే చేయండి, ప్రజల సమక్షంలో భూమి ఎవరిదో తెలుసుకోండి అని చెప్పారు. నిబంధనల పేరిట రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇవ్వకపోవడం సరికాదన్నారు. లీప్స్ సంస్థ ప్రతినిధులు యాచారం మండలాన్ని దత్తత తీసుకుని 24 గ్రామాల్లో భూ సమస్యలను గుర్తించి నివేదిక ఇచ్చినప్పటికీ ఒక్క సమస్య పరిష్కరించకపోతే ఎలా అని ప్రశ్నించారు. అధికారుల తీరు వల్లే భూధాన్, సీలింగ్ అని రికార్డులు మారాయని మండిపడ్డారు. నింబంధనలు సాకులు చూపించి రైతులను ఇబ్బందులు పెడితే సహించేది లేదన్నారు. రేవంత్‌రెడ్డి సర్కార్ రైతాంగ సంక్షేమం, భూ సమస్యలపై చిత్తశుద్ధితో పనిచేస్తుంది, సర్కార్‌కు చెడ్డపేరు తీసుకురావాలని చూస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో భూ సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. ఇబ్రహీంపట్నం, యాచారం, మంచాల, కందుకూరు, ఆమన్‌గల్లు, కడ్తాల్, మహేశ్వరం, షాద్‌నగర్ తదితర మండలాల నుంచి భూ సమస్యలపై రైతులు నిత్యం ఫోన్లు చేస్తున్నారు. త్వరలో కలెక్టర్ నారాయణరెడ్డితో సమావేశమై సాధ్యమైనంత వరకు భూ సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

న్యూస్‌రీల్

మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు!

నేటి నుంచి లబ్ధిదారులకు చెక్కుల అందజేత

సాక్షి, రంగారెడ్డిజిల్లా: కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాల ద్వారా చిన్నపాటి వ్యాపారాలు చేసుకునే స్వయం సహాయక సంఘాల మహిళలకు వడ్డీ లేని రుణాలను అందజేయాలని నిర్ణయించింది. 'ఇందిరా మహిళా శక్తి'పథకం కింద అందజేసే ఈ రుణాలను ఈ నెల 17న చేవెళ్లలోని 3,441 పొదుపు సంఘాలకు రూ.3.58 కోట్లు, 18న మహేశ్వరంలోని 2,134 సంఘాలకు రూ.2.09 కోట్లు, 19న కల్వకుర్తిలోని 2,409 సంఘాలకు రూ.2.30 కోట్లు, రాజేంద్రనగర్‌లోని 983 సంఘాలకు రూ.0.90 కోట్లు పంపిణీ చేయనుంది. 21న ఇబ్రహీంపట్నంలోని 3,642 సంఘాలకు రూ.3.93 కోట్లు, 22న షాద్‌నగర్‌లోని 3,418 సంఘాలకు రూ.3.29 కోట్ల చెక్కులను పంపిణీ చేయనుంది.

రైల్ భవన్‌కు ఎమ్మెల్యే

షాద్‌నగర్ రైల్వే బ్రిడ్జి అనుమతుల పురోగతిపై ఆరా



రైల్వేశాఖ ఉన్నతాధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: పట్టణంలోని చటాన్‌పల్లి రైల్వే బ్రిడ్జి డిజైన్ అనుమతులు, పనులను ప్రారంభం కోసం బుధవారం ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్ రైల్ భవన్‌లో రైల్వే ఉన్నతాధికారులను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. షాద్‌నగర్ రైల్వే బ్రిడ్జి డిజైన్ అనుమతుల పురోగతికోసం రైల్వే ఉన్నతాధికారులను కలిసామని చెప్పారు.షాద్‌నగర్‌తో పాటుగాబుచ్చిగూడ, చటాన్‌పల్లి మూడు దిక్కులను కలి పేలా త్రిభుజాకారంలో జంక్షన్, చటాన్‌పల్లివైపు వేసే బ్రిడ్జి డిజైన్ పనులను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సౌత్ సెంట్రల్ రైల్వే డిప్యూటీ జనరల్ మేనేజర్ ఉదయ్‌నాథ్, చీఫ్ ప్రాజెక్టు మేనేజర్ సాంబశివరావును కోరానన్నారు. త్వరలోనే రైల్వే బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసి ప్రజల ఇబ్బందులను తీర్చేందుకు కృషి చేస్తానని అన్నారు. రైల్వే ఉన్నతాధికారులను కలిసిన వారిలో రోడ్లు, భవనాలశాఖ ఏఈలు రవీందర్, సందీప్ ఉన్నారు.

యంజాల్ ఎఫ్ఎస్‌సీఎస్‌కు అప్రిసియేషన్ అవార్డు



అవార్డు అందుకుంటున్న టెస్కాబ్ వైస్ చైర్మన్ సత్తయ్య

తుర్కయంజాల్: ఉత్తమ పనితీరు కనబరిచిన తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘానికి అప్రిసియేషన్ అవార్డు వరించింది. బుధవారం నాబార్డు 44వ వ్యవస్థాపక దినోత్సవాన్ని తెలంగాణ రీజినల్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోదాముల నిర్వాహణ, లాకర్ల సదుపాయం, ఎరువుల సరఫరా, వ్యవసాయ, వ్యవసాయేతర ఆర్థిక సేవలు, సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన సామాజిక కార్యక్రమాలు, ఉత్తమ పనితీరును పరిగణనలోకి తీసుకుని తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘానికి అప్రిసియేషన్ అవార్డును ప్రకటించారు. ఈ మేరకు టెస్కాబ్ వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్, తుర్కయంజాల్ రైతుసేవా సహకార సంఘం చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్యకు వ్యవసాయ, సహకార, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, నాబార్డు సీజీఎం బి.ఉదయ్‌భాస్కర్ అవార్డు అందజేశారు. ఈ కార్యక్రమంలో టెస్కాబ్ చైర్మన్ ఎం.రవీందర్ రావు, ఆర్‌సీఎస్ సురేంద్ర మోహన్ తదితరులు పాల్గొన్నారు.

హల్దీరాం గోదాంలో అగ్ని ప్రమాదం

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి డివిజన్, పాపిరెడ్డినగర్ సి బ్లాక్ రోడ్డు నెంబర్ 8లోని హల్దీరాం గోదాంలో మంగళవారం రాత్రి అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. దీనిని గుర్తించిన స్థానికులు పోలీస్, ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది రెండు ఫైర్ ఇంజన్‌లతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. భారీ ఎత్తున మంటలు చెలరేగడంతో పరిసర ప్రాంతాల వారు భయాందోళనకు గురయ్యారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సర్కారు భూమి స్వాధీనం

- రూ.200 కోట్ల విలువ చేసే భూమి చుట్టూ ప్రీ కాస్ట్‌వాల్ నిర్మాణం
- పోలీసు బందోబస్తుతో కూల్చివేతలు చేపట్టిన రెవెన్యూ అధికారులు



అక్రమంగా నిర్మించిన ప్రీకాస్ట్‌వాల్‌ను కూల్చివేయిస్తున్న రెవెన్యూ అధికారులు

మొయినాబాద్: నగర శివారులో ఔటర్ రింగ్ రోడ్డుకు రెండు కిలోమీటర్ల దూరంలో రూ.200 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు కబ్జాకోరల నుంచి కాపాడారు. దీని చుట్టూ అక్రమంగా నిర్మించిన ప్రీకాస్ట్ వాల్‌ను జేసీబీతో కూల్చివేసి స్వాధీనం చేసుకున్నారు. మున్సిపల్ పరిధిలోని అజీజ్‌నగర్ రెవెన్యూ సర్వేనెంబర్ 176లో పదెకరాల ప్రభుత్వ భూమిని నగరానికి చెందిన ఓ వ్యక్తి కబ్జా చేసి ప్రీకాస్ట్ వాల్ నిర్మించాడు. కబ్జాకు గురైన స్థలం ఓఆర్‌ఆర్‌కు అతి చేరువలో హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారికి ఆనుకుని ఉంది. ఇక్కడ ఎకరం రూ.20 కోట్ల వరకు పలుకుతోంది. ఈ లెక్కన కబ్జాకు గురైన భూమి విలువ సుమారు రూ.200 కోట్లు ఉంటుంది. ఈ విషయం తెలుసుకున్న మొయినాబాద్ రెవెన్యూ అధికారులు బుధవారం పోలీసులతో అక్కడికి వెళ్లారు. జేసీబీ సాయంతో ప్రీకాస్ట్ వాల్‌ను కూల్చివేస్తుండగా కబ్జాదారుడు వచ్చి అడ్డుకునేందుకు యత్నించాడు. ఓ మంత్రి పేరు చెప్పి బెదిరించాడు. అయినా రెవెన్యూ అధికారులు వెనక్కి తగ్గకుండా అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేసి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ గౌతమ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ భూముల జోలికి వస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎంతటివారైనా ఉపేక్షించమన్నారు. ప్రభుత్వ భూముల చుట్టూ ఫెన్సింగ్ వేయిస్తున్నామని.. మొదటి విడతలో 300 ఎకరాలను గుర్తించి ఫెన్సింగ్ పనులు చేపడుతున్నామన్నారు. కూల్చివేతల్లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజేశ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కుర్మిద్దలో నెట్ జీరో సిటీ పీఎస్

- సర్వేనంబరు 311లో స్థల పరిశీలన చేసిన మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి



స్థల పరిశీలన చేస్తున్న మహేశ్వరం డీసీపీ, ఏసీపీ, సీఐ

యాచారం: ఫ్యూచర్ సిటీ భద్రతా దృష్ట్యా ప్రభుత్వం నెట్ జీరో సిటీ ఠాణా ఏర్పాటు చేయతలపెట్టింది. గత బీఆర్‌ఎస్ సర్కార్ ఫార్మాసిటీ ఏర్పాటు నేపథ్యంలో మండల పరిధిలోని నక్కర్తమేడిపల్లిలో హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పీఎస్ ఏర్పాటు చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ఫార్మాసిటీ భూముల్లో ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి చర్యలు చేపట్టిన విషయం విదితమే. గ్రీన్ ఫార్మాసిటీ పీఎస్‌గా ఉంటే ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో సర్కార్ రూటు మార్చింది. హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పీఎస్ పేరు మార్చేసి, ఇక నుంచి నెట్ జీరో సిటీగా కొనసాగించనుంది. అన్ని హంగులు, సకల సౌకర్యాలతో కూడిన నెట్ జీరో సిటీ పీఎస్‌ను నిర్మించాలని యోచిస్తోంది. ఈ మేరకు బుధవారం మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు, గ్రీన్ ఫార్మాసిటీ సీఐ లిక్కి కృష్ణంరాజు నెట్ జీరో సిటీ పీఎస్ ఏర్పాటుకు కావాల్సిన స్థలాన్ని పరిశీలించారు. కుర్మిద్ద సమీపంలో గ్రీన్ ఫీల్డ్ రోడ్డు ఏర్పాటు చేయతలపెట్టిన సమీపంలోని సర్వే నంబరు 311లో ఐదు నుంచి పదెకరాల్లో నూతన నెట్ జీరో సిటీ పీఎస్‌ను నిర్మించేందుకు సర్కార్ సమాలోచనలు చేస్తోంది.

సాగు సంక్షోభం

వర్షాలు కురవక తగ్గిన సేద్యం



నక్కర్తమేడిపల్లిలో ఎండిన చెరువు

- వరి పంటకు గడ్డుకాలం
- పదిరోజుల్లో వర్షాలు కురిస్తేనే పత్తి పంట ఎదుగుదల

యాచారం: వర్షాభావ పరిస్థితులతో జిల్లాలో సాగు విస్తీర్ణం సగానికి తగ్గింది. సీజన్ ప్రారంభమైన నాటి నుంచి జిల్లాలో భారీ వర్షాల జాడే లేదు. ముసురు వర్షాలకే రైతులు సాగు ప్రారంభించారు. జిల్లా వ్యవసాయాధికారులు ఈ ఏడాది సాగు విస్తీర్ణం 3,58,089 ఎకరాలుగా అంచనా వేశారు. జూన్ 10 తర్వాత రెండు, మూడు రోజుల పాటు అడపాదడపా కురిసిన ముసురుకు రైతులు పత్తి, మొక్కజొన్న, సజ్జ తదితర పంటలను సాగు చేశారు. ఆ తర్వాత వరుణుడు మొహం చాటేయడంతో మొలకెత్తిన పంటలు వట్టిపోతాయోమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. రూ.లక్షలు పెట్టుబడులు పెట్టామని వర్షాలకు కురవక పోతే పంటల ఎదుగుదల కష్టమేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పత్తి పంటపైనే ఆశలు

గతేడాది పత్తి పంట సాగుతో రైతుకు ఊహించని దిగుబడి, ధరలు వచ్చి లాభాలు ఆర్జించాడు. ఈ నేపథ్యంలో వ్యవసాయ శాఖ ఏడాది లక్షన్నర ఎకరాల్లో పత్తి సాగు అవుతుందని అంచనా వేసింది. జిల్లాలోని మాడ్గుల, యాచారం, మంచాల, కేశంపేట, షాబాద్, తలకొండపల్లి, ఆమనగల్లు, కడ్తాల్, షాద్‌నగర్, కందుకూరు, మహేశ్వరం తదితర మండలాల్లో 1,26,486 ఎకరాల్లో తెల్లబంగారం సాగు చేపట్టారు. మే నెలలో కురిసిన కొద్ది పాటి వర్షానికే కొందరు రైతులు పొలాలను సిద్ధం చేసుకుని ఆ వెంటనే పత్తి పంటను సాగు చేయగా, మరికొందరు జూన్‌లో కురిసిన వర్షాలకు పత్తి విత్తుకున్నారు.

వరి పంటకు గడ్డుకాలమే..

1,40,238 ఎకరాల్లో వరి పంట సాధారణ విస్తీర్ణం కాగా ఇప్పటి వరకు కేవలం 29 వేల ఎకరాల్లోనే సాగుచేపట్టారు. ఆశించిన వర్షాలు లేక పోవడంతో బోరు బావుల్లో భూగర్భజలాలు అడుగంటిని పరిస్థితి. భారీ వర్షాలు కురిస్తేనే చెరువులు, కుంటలు నిండి భూగర్భజలాలు పెరిగి నీరు అందే అవకాశం ఉంది.

24.07 లోటు వర్షపాతం

ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా వర్షపాతం సాధారణంగానే ఉంది. జూన్‌లో 97.2 మిల్లీ మీటర్ల సగటు వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా నేటికి కేవలం 73.8 మిల్లీమీటర్ల సగటు వర్షపాతమే కురిసింది. అంటే జూన్‌లోనే 24.07 మిల్లీ మీటర్ల సగటు లోటు వర్షపాతం నమోదయింది. యాచారం, మంచాల, మహేశ్వరం, మాడ్గుల, కేశంపేట, ఇబ్రహీంపట్నం, షాబాద్ మండలాల్లోనే కొంచెం అత్యధిక వర్షపాతం నమోదవగా. కడ్తాల్, ఫరూఖ్‌నగర్, చేవెళ్ల, అబ్దుల్లాపూర్‌మెట్, హయత్‌నగర్, కందుకూరు, కొందుర్గు, కొత్తూరు, రాజేంద్రనగర్, శంకర్‌పల్లి, శంషాబాద్ తదితర మండలాల్లో అత్యల్ప వర్షపాతం నమోదయింది. వర్షపాతం అత్యధికంగా ఉన్న మాడ్గుల, యాచారం, కేశంపేట, షాబాద్‌తదితర మండలాల్లో పత్తి పంట సాగుకే మొగ్గ చూపారు.

వానాకాలం సాగు వివరాలు

పంట	అంచనా (ఎకరాల్లో)	సాగైన పంటలు (ఎకరాల్లో)
వరి	1,40,238	2,8510
జొన్న	5,562	3,608
సజ్జ	21	5
మొక్కజొన్న	52,207	50,922
రాగులు	30	2
కంది	14,308	14,563
ఆముదం	37	8
పత్తి	1,41,088	1,26,486
ఇతర పంటలు	4,382	1,500

వర్షాలు కురిస్తేనే..



భారీ వర్షాలు కురిస్తేనే వరి పంటకు జీవం పోసినట్లు అవుతుంది. ఇప్పటికే రైతులు వరి నార్లు పోసుకున్నారు. వారం, పది రోజుల్లో భారీ వర్షాలు కురిస్తే నాట్లకు ఇబ్బంది ఉండదు. పత్తి పంట బాగా ఎదుగుతుంది. కొద్ది రోజులుగా వర్షాల జాడే లేకపోవడంతో పత్తి మొలకలు వాడిపోతున్నాయి. గతేడాది అధిక లాభాల దృష్ట్యా ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా పత్తి పంటపై రైతులు ఆసక్తి చూపారు. వర్షాలు కురిస్తే ఇతర పంటల సాగు విస్తీర్ణం కూడ పెరిగే అవకాశం ఉంటుంది.

– డి.ఉష, జిల్లా వ్యవసాయాధికారి



ఎనికేపల్లి భూముల వద్ద బాధిత రైతుల వంటావార్పు

భూముల వద్దే వంటావార్పు

- పదో రోజుకు చేరిన ఎనికేపల్లి రైతుల రిలే దీక్ష

మొయినాబాద్: తమకు న్యాయం చేయాలంటూ ఎనికేపల్లి రైతులు చేపడుతున్న రిలే దీక్ష బుధవారం 10వ రోజు కొనసాగింది. మున్సిపల్ పరిధి ఎనికేపల్లిలో సర్వేనెంబర్ 180లోని 99.14 ఎకరాల భూమిని ప్రభుత్వం గోశాలకు కేటాయించడంతో ఆ భూములు సాగుచేసుకుంటున్న రైతులు రిలే దీక్ష చేపడుతున్నారు. కొందరు రైతులకు చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య మంగళవారం పరిహారంగా ఎకరాకు 300 గజాల చొప్పున పట్టాలు అందజేశారు. మిగిలిన రైతులు దీక్షను కొనసాగిస్తున్నారు. బుధవారం భూముల వద్దనే వంటావార్పు చేసి నిరసన తెలిపారు. వారికి మద్దతుగా బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీకాంత్, ఇతర నాయకులు దీక్షలో కూర్చున్నారు.

రైతులందరికీ పరిహారం

గోశాల ఏర్పాటుతో భూములు కోల్పోతున్న రైతులందరికీ ప్రభుత్వం పరిహారం ఇస్తుందని చేవెళ్ల ఆర్డీఓ చంద్రకళ అన్నారు. బుధవారం మండల తహసీల్దార్ కార్యాలయంలో ఆరు కుటుంబాలకు చెందిన 16 మందికి పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ఎనికేపల్లి సర్వేనెంబర్ 180లోని 99.14 ఎకరాల ప్రభుత్వ భూములను గ్రామానికి చెందిన కొందరు రైతులు చాలా కాలంగా సాగుచేసుకుంటున్నారని.. వారికి ప్రభుత్వం ఎకరాకు 300 గజాల స్థలాన్ని పరిహారంగా ఇస్తుందన్నారు. మంగళవారం పది కుటుంబాలకు చెందిన 26 మందికి ఎమ్మెల్యే యాదయ్య చేతుల మీదుగా పట్టాలు పంపిణీ చేశామన్నారు. రెండు రోజుల్లో మొత్తం 16 కుటుంబాలకు చెందిన 42 మందికి పట్టాలు ఇచ్చామని చెప్పారు. ఇంకా కొంత మంది రైతులు గురువారం వస్తారన్నారు. మిగిలినవారు సైతం రెండు మూడు రోజుల్లో వచ్చి పట్టాలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గౌతమ్‌కుమార్, పీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్, డిప్యూటీ తహసీల్దార్ వినోద్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అద్భుత దృశ్యం

గండిపేట చెరువు వద్ద బుధవారం సాయంత్రం 6:30 గంటలకు అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. ఎరుపెక్కిన ఆకాశం నుంచి చెరువులో పడిన సూర్యకిరణాలతో కనుచూపు మేర నింగి, నేల అరుణ వర్ణమైంది. గోవా, ఊటీ వంటి ప్రదేశాల్లో కనిపించే ఇలాంటి దృశ్యాన్ని చూసిన వారు ఆనందం వ్యక్తంచేశారు. – మొయినాబాద్ రూరల్

తాళం వేసిన ఇంట్లో చోరీ

ఏడున్నర తులాల బంగారం అపహరణ

చేవెళ్ల: తాళం వేసిన ఇంట్లో దొంగలు పడి ఏడున్నర తులాల బంగారం, 15 తులాల వెండి, రూ.10 వేల నగదును దోచుకెళ్లారు. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాలాజీనగర్ కాలనీలో చోటు చేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన ప్రకారం.. బాలాజీనగర్ కాలనీలో రిటైర్డ్ ఉద్యోగి కె.శాంతయ్య, భార్య లలితతో కలిసి నివాసం ఉంటున్నారు. వీరు ఈ నెల 14న కుటుంబసభ్యులంతా కలిసి ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి హైదరాబాద్ వెళ్లారు. మంగళవారం రాత్రి ఇంటికి వచ్చి చూసే సరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. వస్తువులన్నీ చిందరవందరగా పడేసి ఉన్నాయి. చోరీ జరిగిందని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. బీరువాలో ఉన్న ఏడున్నర తులాల బంగారం, 15 తులాల వెండి, రూ.10 వేల నగదు అపహరించినట్లు గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రైతులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలి

నందిగామ: ఉపాధి కల్పిస్తామని తమ వద్ద కారుచౌకగా భూములు కొనుగోలు చేసి ఎలాంటి పరిశ్రమలు స్థాపించకుండా పోవడమే కాకుండా ప్రశ్నించిన తమపై కేసులు పెట్టడమేమిటని మండలంలోని చేగూరు, నర్సప్పగూడ రైతులు బుధవారం పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. బాధిత రైతుల కథనం ప్రకారం.. చేగూరు రెవెన్యూ శివారులోని నర్సప్పగూడ గ్రామ పంచాయతీ పరిధిలో చేగూరు రోడ్డులో హైదరాబాద్ హైటెక్ టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు చేస్తామని, భూములు ఇచ్చిన రైతులకు ఉపాధి కల్పిస్తామని చెప్పి సుమారు 143 ఎకరాల భూమిని 2002, 2003లో కొనుగోలు చేశారన్నారు. అక్కడ నేటికి ఒక్క పరిశ్రమను స్థాపించలేదన్నారు. ఇదేంటని ప్రశ్నించిన తమపై కేసు నమోదు చేశారని వాపోయారు. టెక్స్‌టైల్ పార్క్ సొసైటీ సభ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకొని, తమపై నమోదు చేసిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు సతీష్, ఆంజనేయులు, మల్లప్ప, సాయి, రమేష్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

వాన కోసం కప్ప కావడి

కడ్తాల్: వాన కోసం మండల కేంద్రంలో బుధవారం కప్ప కావడి నిర్వహించారు. ఈ సందర్భంగా కప్పకు ప్రత్యేక పూజలు చేసి, గ్రామంలో ఊరేగించారు. అనంతరం మహాదేవునికి బోనం సమర్పించారు. సకాలంలో వర్షాలు సమృద్ధిగా కురిసి, పాడి పంటలతో రైతులు సంతోషంగా ఉండాలని కోరుకున్నారు. కార్యక్రమంలో నాయకులు రాఘవేందర్, సత్యనారాయణ, నాగరాజుగౌడ్, మహిళలు ఉన్నారు.

భారతి సిమెంట్‌తో నిర్మాణం వేగవంతం

సంస్థ టెక్నికల్ ఇంజనీర్ స్వామ్రాట్



తాపీమేస్త్రీకి బీమా బాండ్‌ను అందిస్తున్న భారతి సిమెంట్ ప్రతినిధులు

చేవెళ్ల: భారతి అల్ట్రా ఫాస్ట్ సిమెంట్‌తో నిర్మాణ ప్రక్రియ చాలా వేగవంతంగా అవుతుందని ఆ సంస్థ టెక్నికల్ ఇంజనీర్ స్వామ్రాట్ అన్నారు. చేవెళ్లలోని గణేశ్ స్టీల్ వద్ద భారతి సిమెంట్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం తాపీమేస్త్రీలకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్కెట్లో లభించే ఇతర సిమెంట్‌తో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణం ప్రక్రియ చాలా వేగవంతంగా పూర్తవుతుందన్నారు. తెలంగాణలో భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెంటింగ్ సిమెంట్ 5స్టార్ గ్రేడ్‌తో విడుదల చేసిందన్నారు. అల్ట్రాఫాస్ట్‌తో ముఖ్యంగా స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారులకు సరైన ఎంపిక అన్నారు. అల్ట్రాఫాస్ట్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందజేస్తున్నామని స్లాబ్ కాంక్రీట్ సమయంలో నిపుణులైన భారతి సిమెంట్ ఇంజనీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయపడుతారని చెప్పారు. అనంతరం 50 మంది తాపీమేస్త్రీలకు రు.లక్ష ప్రమాద బీమా బాండ్లను అందజేశారు. డీలర్ సదానందం మాట్లాడుతూ.. భారతి సిమెంట్ సర్వీస్ చాలా ఫాస్ట్‌గా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో సంస్థ టెక్నికల్ ఇంజనీర్ బృందం, తాపీమేస్త్రీలు తదితరులు పాల్గొన్నారు.

బస్సులు ఆపాలని వినతి

తుర్కయంజాల్: సాగర్ రహదారి గుండా రాకపోకలు సాగించే ఇబ్రహీంపట్నం డిపో ఆర్టీసీ బస్సులను తుర్కయంజాల్‌లోని కట్టమైసమ్మ దేవాలయం నిలపాలని సీపీఎం నాయకులు కోరారు. బుధవారం ఇబ్రహీంపట్నం డిపో మేనేజర్ నర్సప్ప వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం ఇంజాపూర్ జోన్ బాధ్యుడు మండల సత్యనారాయణ మాట్లాడుతూ.. ఆలయం వద్ద బస్సు నిలపకపోవడంతో కమ్మగూడ, ఇంజాపూర్‌లోని అనేక కాలనీల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ఈ బస్‌స్టాప్‌కు సమీపంలోనే నాలుగు వీకర్ సెక్షన్ కాలనీలు ఉన్నాయని, వీరంతా ఉద్యోగ, ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్తుంటారని తెలిపారు. అందుకు ఆర్టీసీ సర్వీసే వారికి ప్రధాన మార్గమన్నారు. ప్రజల రవాణా సౌకర్యాన్ని గుర్తించి, బస్సులు ఆపాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణ, శంకరయ్య, కుమార్, సత్యం, సాయి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ధర్మాస్పత్రి సమస్యలు పరిష్కరించాలి




రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్‌కు బీజేపీ నేతలు బుధవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ అధ్యక్షుడు ముత్యాల మహేందర్ మాట్లాడుతూ.. ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండటం లేదని ఆరోపించారు. దీంతో రోగులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. పేదలు ఎక్కువ శాతం సర్కారు దవాఖానలకే వస్తుంటారని, అలాంటి వారికి సకాలంలో వైద్యం అందక ప్రైవేటు ఆస్పత్రులు పరుగులు తీస్తున్నారని పేర్కొన్నారు. సాయంత్రం నుంచి వైద్యులు ఉండకపోవడంతో ఎమర్జెన్సీ కేసులను చూసే వారు లేరన్నారు. తాత్కాలికంగానైనా అత్యవసర వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక సిబ్బందిని నియమించాలని కోరారు. పాలకుల హామీ మేరకు వంద పడకల ఆస్పత్రి నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలన్నారు. నిరంతరం వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబర్ రాఘవేంద్ర స్వామి, బీజేవైఎం జిల్లా కార్యదర్శి విజయ్‌కుమార్, కార్యవర్గ సభ్యులు అనిల్, మున్సిపల్ కార్యదర్శి సంతోష్ ఉన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు



విద్యార్థులతో కలిసి వాలీబాల్ ఆడుతున్న డీఈఓ సుశీందర్ రావు

శంకర్‌పల్లి: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని జిల్లా విద్యాధికారి సుశీందర్ రావు అన్నారు. బుధవారం ఆయన మండల పరిధిలోని జన్వాడ జెడ్పీహెచ్ఎస్‌ను సందర్శించారు. ఎంఈఓ అక్బర్‌తో కలిసి కేఎస్ఏ ఫౌండేషన్ వారు రూ.3 లక్షలతో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ని ప్రారంభించారు. అనంతరం పాఠశాలను విద్యార్థులతో కలిసి వాలీబాల్ ఆడారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సాయం చేసేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. చదువులో వెనకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలరాజ్ పాల్గొన్నారు.

చోరీ సొత్తు రికవరీ

కందుకూరు: చోరీకి పాల్పడిన వ్యక్తిని చాకచక్యంగా గుర్తించి అతని నుంచి బంగారు, వెండి ఆభరణాలను పోలీసులు రికవరీ చేశారు. ఈ సంఘటన కందుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ సీతారామ్ తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని జబ్బార్‌గూడకు చెందిన గోల్కొండ లక్ష్మి కుటుంబీకులు ఈ నెల 2న ఇంటికి తాళం వేసి పనులపై బయటికి వెళ్లారు. ఇది గమనించిన ఓ దొంగ ఇంట్లో చొరబడి నాలుగు తులాల బంగారం, 40 తులాల వెండి ఆభరణాలను తస్కరించాడు. ఈ విషయమై అదే రోజు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ ఆదేశాల మేరకు పెట్రోలింగ్ కానిస్టేబుల్ ఆఫీసర్ ఎం.రమేష్ ఆ గ్రామంలో దర్యాప్తు చేపట్టాడు. ఓ వ్యక్తిపై అనుమానం వ్యక్తం చేయగా.. క్రైం కానిస్టేబుల్స్ పాండు రంగారెడ్డి, శేఖర్ వెళ్లి అనుమానితుడ్ని చాకచక్యంగా పట్టుకుని విచారించగా చోరీకి పాల్పడినట్లు అంగీకరించాడు. దీంతో చోరీ సొత్తును సేకరించి బాధితురాలికి అప్పగించారు. నిందితుడ్ని రిమాండ్‌కు తరలించారు.

ఉన్నత చదువుతోనే ఉజ్వల భవిష్యత్

ప్రొఫెసర్ డాక్టర్ శోభారాణి



డాక్టర్ శోభారాణిని సన్మానిస్తున్న కళాశాల చైర్మన్ పర్వత్‌రెడ్డి తదితరులు

షాద్‌నగర్‌రూరల్: ఉన్నత విద్యను అభ్యసించినప్పుడే ఉజ్వల భవిష్యత్ లభిస్తుందని జేఎన్టీయూ ప్రొఫెసర్ డాక్టర్ శోభారాణి అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మూన్రే ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్(ఎంఐపీఎస్) కళాశాలలో బుధవారం మిప్స్కాన్–2025 జాతీయ సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా జేఎన్టీయూ ప్రొఫెసర్ డాక్టర్ శోభారాణి హాజరై జ్యోతి ప్రజ్వలనచేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రణాళికను రూపొందించుకొని నిరంతరం లక్ష్య సాధనకోసం శ్రమించాలని సూచించారు. సాధించాలనే కృషి, పట్టుదల ఉంటే విజయాలు వెన్నంటే ఉంటాయన్నారు. విద్యార్థులు తమ మేధస్సుకు పదునుపెట్టి తాము ఎంచుకున్న రంగాలలో ఘనవిజయాలను సొంతం చేసుకోవాలని ఆకాంక్షించారు. షాద్‌నగర్ ప్రాంతం పారిశ్రామిక ప్రాంతంగా వెలుగొందుతుందని, ఉత్తమ ఫలితాలను సాధించే విద్యారులకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని చెప్పారు. అనంతరం కళాశాల చైర్మన్ పర్వత్‌రెడ్డి మాట్లాడుతూ.. 2007లో 60 మంది విద్యార్థులతో ప్రారంభమైన కళాశాల అంచెలంచలుగా ఎదిగి ఎందరో విద్యార్థులకు ఉపాధి అవకాశాలను అందించిందని అన్నారు. అనంతరం ప్రొఫెసర్ డాక్టర్ శోభారాణిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ సాయికృష్ణ, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో వసతులు కల్పించాలి



పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న సంతోష్

ఆమనగల్లు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంతోష్ కోరారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థుల సమస్యలను తెలుసుకోవడానికి సర్వే నిర్వహించారు. అనంతరం సంతోష్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని కోరారు. పాఠశాలల్లో అవసరమైన వసతులు కల్పించడంతో పాటు ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. బాలుర ఉన్నత పాఠశాలలో పీఈటీ పోస్టును భర్తీ చేయాలని, విద్యార్థుల లైబ్రరీ సౌకర్యం కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు, రామ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

బోధనేతర పనులు అప్పగించొద్దు

ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్



నోములలో ఉపాధ్యాయులతో ఎస్టీయూ నాయకులు

మంచాల: ఉపాధ్యాయులను బోధనేతర పనులకు వినియోగించడం తగ్గించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పుట్టపాక ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని నోముల, లింగంపల్లి, మంచాల, తాళ్లపల్లిగూడ, తిప్పాయిగూడ, జాపాల, ఆరుట్ల పాఠశాలల్లో ఉపాధ్యాయులను కలిసి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒకవైపు ఉపాధ్యాయులను చరవాణి ఉపయోగించ రాదని చెప్పి మరోవైపు ఫోన్‌లో అన్ని వివరాలు నమోదు చేయాలని ఆదేశించడం ఎంతవరకు సమాంజసమన్నారు. విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం, పరీక్ష ఫలితాలు తదితర వివరాలను ఫోన్‌లో నమోదు చేయాలన్నారు. కానీ సమయానికి యాప్‌లు సరిగ్గా పని చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రభుత్వం పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. 2008 డీఎస్సీ ఉపాధ్యాయులకు ఆరు నెలలుగా వేతనాలు అందలేదన్నారు. వెంటనే వారికి జీతాలు విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాండురంగారెడ్డి, నాయకులు సుధాకర్, జయానంద్, శ్రీనివాస్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కిరోసిన్ డబ్బాలతో హల్‌చల్

న్యాయం చేయాలని రైతుల ప్రదర్శన



కిరోసిన్ డబ్బాలతో ఆందోళన చేస్తున్న రైతులు

నందిగామ: తమ భూములు కొనుగోలు చేస్తామని ఒప్పందం చేసుకొని పత్తాలేకుండా పోవడమే కాకుండా, మమ్మల్ని సదరు భూమిలోకి రాకుండా అడ్డుకుంటున్న రియల్ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని మండలంలోని అప్పారెడ్డిగూడ రైతులు ఆందోళన చేపట్టారు. ఈ మేరకు కిరోసిన్ డబ్బాలతో తమ పొలాల వద్ద బుధవారం నిరసనకు దిగారు. అందుకు సంబంధించిన వివరాలు.. మండల పరిధిలోని వీర్లపల్లి రెవెన్యూ శివారు అప్పారెడ్డి గూడలో 370 నుంచి 377 వరకు గల సర్వే నంబర్లలో ముగ్గురు రైతుల నుంచి సుమారు 11 ఎకరాలను హైదరాబాద్‌కు చెందిన కొందరు వ్యాపారులు కొనుగోలు చేస్తామని, కొంత డబ్బులు చెల్లించి 2024 జూలైలో ఒప్పందం చేసుకున్నారు. గడువు తీరినా మిగతా డబ్బులు చెల్లించకపోవడమే కాకుండా సదరు భూమిలోకి పోలీసులను పంపించి తమని రానివ్వకపోడం ఏమిటని రైతులు రామయ్య, చెన్నయ్య, అనుసూజ తదితరులు ఆందోళన వ్యక్తం చేశారు. ఒప్పందం మేరకు తమకు డబ్బులు ఇవ్వాలని, లేనట్లయితే తాము తీసుకున్న డబ్బులు తిరిగి చెల్లించి ఒప్పందం రద్దు చేసుకుంటామని చెప్పారు.

నోటీసులిచ్చారు.. న్యాయం చేయండి



సోలిపేట రైతులతో మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

షాబాద్: ప్రభుత్వ భూమి నుంచి మట్టి తరలించిన వారిపై చర్యలు తీసుకోవాలని సోలిపేట్ రైతులు కోరారు. ఈ మేరకు బుధవారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డిని కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 350 సర్వేనంబర్‌లోని భూమిని ప్రభుత్వం పలువురికి అసైన్ చేసిందని తెలిపారు. ఇందులో నుంచి అక్రమార్కులు మట్టి తరలించి, సొమ్ము చేసుకున్నారన్నారు. ఈ విషయం తెలియడంతో రెవెన్యూ అధికారులు రైతులకు నోటీసులు ఇచ్చారని తెలిపారు. దీనిపై స్పందించిన మధుసూదన్‌రెడ్డి చేవెళ్ల ఆర్డీఓ చంద్రకళతో మాట్లాడి ఇబ్బంది లేకుండా చూస్తానని హామీ ఇచ్చారు. బాధిత రైతుల వెంట జనార్దన్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, కుమ్మరి విఠల్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న సబితారెడ్డి

ఎన్నిక ఏదైనా.. గెలుపు బీఆర్‌ఎస్‌దే ఉండాలి

- మాజీ మంత్రి సబితారెడ్డి
- జన్వాడలో శంకర్‌పల్లి ముఖ్యనాయకుల సమావేశం

శంకర్‌పల్లి: రాష్ట్రంలో ఏఎన్నిక వచ్చినా గెలుపు బీఆర్‌ఎస్‌దే ఉండాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం శంకర్‌పల్లి మండలం జన్వాడలో మండల ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సబితారెడ్డి మాట్లాడుతూ.. నాయకులెవరైనా ప్రతిపక్షంలో ఉన్నప్పుడే రాజకీయంగా ఎదిగే అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్రంలో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధంగా ఉండాలని, ఏ క్షణంలోనైనా నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందన్నారు. నాయకులు పార్టీ కార్యాలయాలను ఏర్పాటు చేసుకుని, రోజు మూడు నుంచి నాలుగు గ్రామాల్లో పర్యటించేలా రూట్ మ్యాప్ సిద్ధం చేసుకోవాలన్నారు. యువతను పార్టీలో భాగస్వామ్యం చేయాలని, పార్టీలో కొత్త, పాత అందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. రెండేళ్ల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చేసింది ఏమి లేదని, సభలు, సమావేశాల్లో కేసీఆర్‌ని తిట్టడం తప్ప వాళ్లు ఏం లేదని ఎద్దేవా చేశారు. గతంలో వైఎస్.రాజశేఖర్‌రెడ్డి, కేసీఆర్‌లు సీఎంగా ఉన్నప్పుడు వర్షాలు సమృద్ధిగా కురిసాయని.. ఇప్పుడు వర్షాలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రుణ మాఫీ, రైతు భరోసా, మహిళలకు రూ. 2,500 ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఓటమి భయంతో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా లేదని, చివరికి హైకోర్టు జోక్యంతో గత్యంతరం లేక, ఎన్నికలు నిర్వహించే పరిస్థితికి వచ్చిందన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ నాయకులు కేసీఆర్ జపం చేయకుండా, ప్రజలకు ఏదైనా మేలు చేసే పనులు చేయాలని కోరారు. గ్రామాలు, పట్టణాలు ఎక్కడ తిరిగినా ప్రజలు మళ్లీ బీఆర్‌ఎస్ వస్తుందని చెప్పడం సంతోషాన్ని కల్గిస్తోందన్నారు. సమావేశంలో శంకర్‌పల్లి, రాయదుర్గం పీఏసీఎస్ చైర్మన్లు శశిధర్‌రెడ్డి, అరవింద్‌రెడ్డి, శంకర్‌పల్లి బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి, నాయకులు రాజు నాయక్, వెంకటేశ్, బాలకృష్ణ, సత్యనారాయణ, నర్సింహారెడ్డి, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పశువులు తరలిస్తున్న కంటైనర్ సీజ్

- గోశాలకు మూగజీవాల తరలింపు
- కేసు నమోదు చేసిన పోలీసులు

కడ్తాల్: అక్రమంగా పశువులను తరలిస్తున్న కంటైనర్‌ను పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. విజయవాడ నుంచి ఓ కంటైనర్‌లో అనుమతి లేకుండా హైదరాబాద్‌కు పశువులు తరలిస్తున్నారని సమాచారం అందుకున్న పోలీసులు కడ్తాల్ సమీపంలో వాహనాన్ని తనిఖీ చేశారు. కంటైనర్‌లో 64 ఆవులు, 41 ఎద్దులు ఉన్నట్లు గుర్తించారు. ఇరుకు స్థలంలో ఊపిరాడక 4ఆవులు మృతిచెందాయన్నారు. పశువులను జియాగూడ కామధేను సమర్థ గోశాలకు తరలించారు. వాహనాన్ని సీజ్ చేసి, యజమాని ఎండీ తలీమ్‌తో పాటు డ్రైవర్, మరో ముగ్గురు కార్మికులపై కేసు నమోదు చేసినట్లు సీఐ గంగాధర్ తెలిపారు.

కొటారి నిర్మలకు డాక్టరేట్



ఇబ్రహీంపట్నం: కంప్యూటర్ సైన్స్, ఇంజనీరింగ్ విభాగంలో చేసిన పరిశోధనలకు గాను కొటారి నిర్మలకు శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రకటించింది. ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.ఉషారాణి పర్యవేక్షణలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో నిర్మల చేసిన పరిశోధనలపై సంతృప్తి వ్యక్తంచేసిన యూనివర్సిటీ డాక్టరేట్ పట్టా అందజేసింది. ప్రస్తుతం ఆమె ఇబ్రహీంపట్నం సమీపంలోని గురునానక్ యూనివర్సిటీలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులను నిర్వహిస్తున్నారు.